సాక్షి
కామారెడ్డి
సోమవారం । 14 । ఆగస్టు । 2023

క్లుప్తంగా

'బీడీ కార్మికులందరికీ జీవనభృతి కల్పించాలి'

కామారెడ్డి రూరల్: కొత్త పీఎఫ్ ఉన్న ప్రతి బీడీ కార్మికురాలికి జీవనభృతి కల్పించాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు.. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, నిరసనలు, ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు.

కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేయాలి

ఎల్లారెడ్డి: మండలాల వారీగా కేటాయించిన స్థలాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మెదక్, నిజాంసాగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు కుడుముల సత్యనారాయణ వెంచర్‌లో, కామారెడ్డి వైపు నుంచి వచ్చే వాహనాలు జీవదాస్ పాఠశాల పక్కన ఏర్పాటు చేసిన స్థలంలోనే పార్కింగ్ చేసి పోలీసులకు సహకరించాలని కోరారు.

కోరుట్ల సభకు తరలిన పద్మశాలీలు



సాక్షి నెట్‌వర్క్: జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి కార్యక్రమానికి నస్రుల్లాబాద్, రాజంపేట, దోమకొండ, నాగిరెడ్డిపేట, తాడ్వాయి, కామారెడ్డి, నిజాంసాగర్, సదాశివనగర్ మండలాల నుంచి భారీగా పద్మశాలి సంఘం నేతలు ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశంతో కోరుట్లలో ఏర్పాటు చేసిన పద్మశాలి గర్జనకు వెళ్తున్నట్లు చెప్పారు. పద్మశాలీలు అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. పద్మశాలి కుల సభ్యులు ఎన్నికల్లో పోటీ చేస్తే పార్టీలకతీతంగా ఓట్లు వేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పద్మశాలీలందరూ ఏకమై తమ భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాజకీయంగా తమ ఐక్యతను చాటుతామని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

బీడీ కార్మికులకు ఇళ్లు కట్టిస్తాం

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్
- మాల్తుమ్మెదలో కార్మికులతో సమావేశం



మాల్తుమ్మెదలో బీడీ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బీడీ కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మాల్తుమ్మెదలో ఆదివారం బీడీ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలోని 60 మంది బీడీ కార్మికులకు స్థలాలు కేటాయించడంతో పాటు వారికి డబుల్‌బెడ్ రూం ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కాలనీలో రోడ్లను వేయించడంతోపాటు మంచి నీళ్ల ట్యాంకును నిర్మించి ఇస్తామని చెప్పారు. ఎంపీటీసీ నారాయణ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దుర్గారెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

నేడు తాడ్వాయికి కేటీఆర్ రాక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి సోమవారం మంత్రి కేటీఆర్ విచ్చేయనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు తెలిపారు. తాడ్వాయిలో మినీ స్టేడియం నిర్మాణానికి రూ.2.5 కోట్ల నిధులు మంజూరు కావడంతో శంకుస్థాపన చేయడానికి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో నేడు జరిగే మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ కోరారు. ఆదివారం సభ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎల్లారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నేతలు జలంధర్‌రెడ్డి, శ్రీనునాయక్ తదితరులున్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య కోరారు. నాగిరెడ్డిపేట నుంచి 4 వేల మందితో సభకు రానున్నట్లు చెప్పారు.



వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- కామారెడ్డి బీజేపీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి



బీజేపీలో చేరుతున్న తిప్పాపూర్ యువకులు

భిక్కనూరు: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలు వంగేటి నర్సారెడ్డి, సీహెచ్ వసంత్, భాస్కర్‌ల ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కాటిపల్లి వెంకటరమణరెడ్డి, బీజేపీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు ఎన్నికల్లో ప్రజలను ప్రలోభ పెట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నారన్నారు. వీరి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నేతలు గణేష్‌రెడ్డి, బస్వారెడ్డి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి భూమి పూజ

రాజంపేట: పొందుర్తిలో పెద్దమ్మ ఆలయం ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం బీజేపీ నేత వెంకటరమణారెడ్డి భూమిపూజ చేశారు. ముదిరాజ్ సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

నూతన కార్యవర్గాలు



బస్వాపూర్ రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం

భిక్కనూరు: బస్వాపూర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌరిగారి రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా గౌరిగారి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్ యాదవరెడ్డి, తదితరులు ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అధ్యక్షుడు తెలిపారు.

పాల్వంచ యాదవ కార్యవర్గం..

మాచారెడ్డి: అఖిల భారత యాదవ మహాసభ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అర్కల ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆర్‌ఆర్ టాలెంట్ పాఠశాలలో ఆదివారం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొమురయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చెరుకూరి అంజయ్య యాదవ్‌లను తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అంబేడ్కర్ యువజన సంఘం..

బాన్సువాడ రూరల్: బోర్లంలో బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నల్లోళ్ల సాయిలు, ఉపాధ్యక్షులుగా దొంతుల వినయ్, తదితరులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బీఆర్ఎస్‌లో చేరడం అభినందనీయం

బీఆర్ఎస్ నేత గంప శశాంక్



శశాంక్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కార్యకర్తలు

కామారెడ్డి రూరల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వివిధ పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరడం అభినందనీయమని ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ తనయుడు గంప శశాంక్ అన్నారు. ఆదివారం చిన్న మల్లారెడ్డిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి సుమారు 150 మంది యువకులు శశాంక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గంప శశాంక్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో సైతం 119 స్థానాల్లో 100 సీట్లు గెలిచి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వజ్జపల్లిలో ఆదివారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 142 ఆవులు, ఎడ్లు, 252 గేదెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రం నర్సయ్య, ఉప సర్పంచ్ ప్రభాకర్ రావు, పాల కేంద్రం అధ్యక్షుడు రమేశ్, పశుగణ సహాయకుడు కిశోర్, సిబ్బంది ఇస్మాయిల్, సాయికుమార్, గోపాలమిత్రలు మురళి, కాశిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం కామారెడ్డి

భిక్కనూరు: కామారెడ్డి నియోజకవర్గాన్ని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపారని భిక్కనూరు ఎంపీపీ గాలిరెడ్డి అన్నారు. ఆదివారం జంగంపల్లిలో సీసీ రోడ్డు, మురికికాలువలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాలిరెడ్డి మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, సర్పంచ్ నర్సింలు యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ సిద్ధరాములు, ఎంపీటీసీ యశోద, ఉప సర్పంచ్ భాస్కర్, వీడీసీ చైర్మన్ శివలింగం తదితరులు పాల్గొన్నారు.

తక్కువ కూలి ఇస్తున్నారని రాస్తారోకో



ఆందోళన చేస్తున్న ఇసుక ఖాళీ చేసే కార్మికులు

కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులోని బైపాస్ వద్ద ఆదివారం ఇసుక ఖాళీ చేసే కార్మికులు రాస్తారోకో చేశారు. తక్కువ కూలి ఇస్తున్నారని ఆరోపిస్తూ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

20 ఏళ్లుగా లారీలలో నుంచి ఇసుకను ఖాళీ చేస్తున్నామని, ఉపాధి కూలి ధర కన్నా తక్కువగా ఇస్తున్నారని, ఈ విషయంలో మాకు న్యాయం చేయాలని కోరారు. మిషనరీల ద్వారా ఇసుకను డంపింగ్ చేయడంతో ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి



జాతీయ జెండాలతో విశ్వహిందూ సభ్యులు

రాజంపేట: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని రాజంపేట విశ్వహిందూ యువసేన సభ్యులు కోరారు. ఆదివారం పోస్టల్ కార్యాలయం నుంచి జాతీయ జెండాలను కొనుగోలు చేసి ఆవిష్కరించారు.

బాన్సువాడలో తిరంగా ర్యాలీ

బాన్సువాడ: పట్టణంలో ప్రధాన రహదారిపై ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. మేరీ మిట్టీ మేరా దేశ్ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా ర్యాలీలు కొనసాగుతున్నాయన్నారు. ఈ దేశం నాది అనే భావన ప్రతి ఒక్కరిలో రావాలనేది ఈ కార్యక్రమ ఉద్దేశమని పట్టణ అధ్యక్షులు గుడుగుట్ల శ్రీనివాస్ అన్నారు.

'గృహలక్ష్మి' ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం

బాన్సువాడ: పట్టణంలోని పాతబాన్సువాడ దళితవాడలో ఆదివారం గృహలక్ష్మి ఇంటి నిర్మాణ పనులను కౌన్సిలర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాత ఇళ్లు శిథిలావస్థలకు చేరాయి. పలు ఇళ్లు కూలిపోయాయి. విషయం తెలిసి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి గృహలక్ష్మి పథకంలో భాగంగా 45 మందికి రూ.3 లక్షల చొప్పున మంజూరు చేస్తానని హామీ ఇవ్వడంతో పనులు ప్రారంభించామని కాలనీవాసులు తెలిపారు.

చేపల వల చుట్టుకుని జాలరి మృతి



బాన్సువాడ రూరల్ : మండలంలోని ఇబ్రాహింపేట్ గ్రామానికి చెందిన కామబోయి(60) అనే మత్స్యకార్మికుడు శనివారం రాత్రి గ్రామంలోని చెరువులో చేపల వేటకు వెళ్లి కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటమునిగి మృతి చెందినట్లు బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మృతుని భార్య చంద్రవ్వ ఫిర్యాదు మేరకు శనివారం సాయంత్రం గ్రామానికి చెందిన గుండె నెమ్లి సంతోష్‌తో కలిసి తన భర్త చేపల వేటకు వెళ్లాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాసేపటకి సంతోష్ ఇంటికి వచ్చినా తన భర్తమాత్రం రాలేదని, చెరువు గట్టుపై దుస్తులు ఉండటంతో అనుమానంతో చెరువులో జాలర్లతో వెతికించగా ఆదివారం మృతదేహం లభించిందన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

నిజామాబాద్ సిటీ: రూరల్ మండలం శ్రీనగర్‌లో ఓ ఇంట్లో పేకాడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకుని అరెస్టు చేశారు. శ్రీనగర్‌లో మస్తాన్‌రావు ఇంట్లో కొంతమంది పేకాటాడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు స్థావరంపై దాడి చేశారు. ఇందులో మస్తాన్‌రావు, సంజీవ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, బొందుగుల శ్రీనివాస్, ఆనంద్‌లు పోలీసులకు చిక్కారు. వీరినుంచి రూ. 70,110లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని నిజామాబాద్ రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ ఎస్‌హెచ్‌ఓ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం మండలంలోని గొట్టిముక్కల శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి రూ. 20,650,10, సెల్‌ఫోన్లు, కారు, ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పేకాటాడుతున్న 10మందిని అరెస్ట్ చేసి మాక్లూర్ పోలీసులకు అప్పగించారు. ఏసీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్ సిబ్బందితో కలిసి స్థావరంపై దాడి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్ 63వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్సు వాహనంలో ఆర్మూర్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

క్రైం కార్నర్

ఒకరి ఆత్మహత్య



మాణిక్యం (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన పారుకల మాణిక్యం (28) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన పారుకల మాణిక్యం నాలుగేళ్ల క్రితం ఎల్లారెడ్డి పల్లి గ్రామానికి ఇల్లరికంగా వెళ్లాడన్నారు. స్వగ్రామంలో తల్లి తండ్రుల ఆస్తి 14 గుంటల భూమి ఉండగా దానిని సాగు చేసుకునేందుకు మూడు రోజుల క్రితం శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి వచ్చాడన్నారు. ఆదివారం గ్రామ శివారులోని కొయ్యగుట్టలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రిటైర్డ్ విద్యుత్ లైన్‌మన్ మృతి



గంగారాం (ఫైల్)

భిక్కనూరు : మండల కేంద్రంలోని రిటైర్డ్ విద్యుత్ లైన్‌మన్ గడ్డం గంగారాం (61) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన అంత్యక్రియల్లో విద్యుత్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

కుక్కల దాడిలో లేగదూడ..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో సంకరి వెంకట్ రాములుకు చెందిన లేగదూడపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. ఇటీవల వెంకట్ రాములుకు చెందిన గిరిరాజ కోళ్లను కూడా కుక్కలు కరిచి చంపేశాయన్నారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, బెడదను నివారించాలని బాధిత రైతు అధికారులను వేడుకుంటున్నాడు. మృతి చెందిన దూడను పశువైద్య గణ సహాయకుడు జుగల్ కిషోర్ పరిశీలించారు.

మద్దెల చెరువు సర్పంచ్..



పండిత్ రావ్ (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని మద్దెల చెరువు గ్రామం సర్పంచ్ పండిత్ రావ్ (52) శనివారం రాత్రి మృతి చెందారు. సర్పంచ్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అప్పటి నుంచి అనారోగ్యానికి గురైన ఆయన శనివారం రాత్రి మృతి చెందారు. సర్పంచ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే హన్మంత్ షిండే, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ..

రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి శివారు మమ్మోడి ఆయా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మహిళ మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ధర్పల్లి మండలంలో ఎస్‌బీ జమేదార్‌గా పని చేస్తున్న పోతుల సాయిలు రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఉన్న తన చెల్లెలు ఇంటికి బైక్‌పై భార్య సుమిత్ర (47)ను తీసుకుని వస్తుండగా దూపల్లి వద్ద ప్రమాదం జరిగింది. ప్రధాన రహదారిపై కల్వర్టు వద్ద బైక్ అదుపు తప్పడంతో వెనకాల కూర్చున్న సుమిత్ర తలకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తీవ్ర రక్తస్రావమైన ఆమెను నిజామాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు స్థానికులు వివరించారు. ఈ విషయమై రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్‌ను విచారించగా బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని, ప్రమాదం జరిగినట్లు సమాచారం ఉందన్నారు.

రుద్రూర్‌లో పట్టపగలు చోరీ

- వృద్ధురాలి ఆభరణాల అపహరణ



చెవికి గాయంతో బాధితురాలు నాగమణి



ఇంట్లో చిందరవందరగా ఉన్న సామగ్రి

రుద్రూర్: మండల కేంద్రంలో రుద్రూర్‌లో ప్రధాన రోడ్డుకు పక్కనే ఇంట్లో ఆదివారం పట్టపగలే ఓ అగంతకుడు వృద్ధురాలిపై దాడిచేసి ఆభరణాలు చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. ఒంటరిగా ఇంట్లో ఉన్న వృద్ధురాలిపై ఉన్న బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న వస్తువులు ఎత్తుకెళ్లారు. కొన్నిరోజులుగా ఆ ఇంటిని నిశితంగా పరిశీలిస్తున్న దుండగుడు చోరీ పాల్పడ్డట్లుగా స్థానికులు భావిస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి (అక్బర్‌నగర్–బోధన్) పక్కనే సొంత ఇంట్లో కంచర్ల నారాయణరావ్ దంపతులు నివసిస్తున్నారు. ఆదివారం నారాయణరావ్ బయటకు వెళ్లగానే అగంతకుడు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని నగలు, వృద్ధురాలిపై ఉన్న బంగారు ఆభరణాలు తెంపుకున్నాడు. వృద్ధురాలు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారు ఘటనస్థలానికి రాగానే దుండగుడు పారిపోయాడు. బాధితురాలి చెవి తెగి రక్తసిక్తం కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సమాచారం అందుకున్న రుద్రూర్ సీఐ జయేశ్ రెడ్డి, ఎస్సై నీరేష్ సందర్శించి బాధితుల ద్వారా వివరాలు సేకరించారు.

తాళం వేసిన ఇంట్లోచోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని శ్రీరామ కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 15 తులాల బంగారం, రూ. 50 వేలు నగదు, బైక్ ఎత్తుకెళ్లిన్నట్లు బాధితుడు విఠల్ తెలిపాడు. దొల్తాపూర్ విఠల్ తన కుటుంబ సభ్యులతో శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి బాన్సువాడకు బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి ఓనర్ నారాగౌడ్ బంగ్లా పైకి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి విఠల్‌కు సమాచారం అందించాడు. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రవీణ్ మృతదేహం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బర్ధిపూర్ గ్రామానికి చెందిన ఇస్సాపల్లి ప్రవీణ్(32) మృతి చెందాడు. ముప్కాల్ ఏఎస్సై చిన్న గంగారాం తెలిపిన వివరాల ప్రకారం ప్రవీణ్ బాల్కొండ నుంచి నిర్మల్ జిల్లా పారిపెల్లి గ్రామానికి అత్తగారింటికి బైక్‌పై వెళ్తుండగా ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 పై మెండోరా వైపు నుంచి వస్తూ రోడ్డు క్రాస్ చేస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ప్రవీణ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నారు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడేవాడని పోలీసులు, ప్రమాద స్థలంలో ప్రత్యక్షసాక్షులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

గుంతలో పడి మహిళ మృతి



సుందర్ బాయి

వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దాపూర్ శివారులో నీటి గుంటలో పడి సుందర్ బాయి (50) మృతి చెందింది. ఆదివారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద పంటకు పురుగుల మందులు కొట్టడానికి వెళ్లి అక్కడే ఉన్న గుంటలో నీటి కోసం దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి గంతలో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదాలో వృద్ధ దంపతులపై దాడి

- స్థలాన్ని కాజేసేందుకు చూస్తున్నారని వృద్ధుల ఆరోపణ
- 10 మందిపై కేసు నమోదు



నరికివేసిన చెట్లను చూపిస్తున్న బాధిత వృద్ధులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : గత నలభై ఏళ్ల నుంచి భూమిని కొనుగోలు చేసి కబ్జాలో ఉంటున్న ఓ వృద్ధ కుటుంబం ఇంటికి వెళ్లి ఇంటి ఆవరణలో పెంచిన భారీ చెట్లను నరికి వేసి, వృద్ధులపై దాడి చేసిన ఘటన ఆదివారం ఉదయం మండలంలోని మర్కల్ గ్రామ శివారు 44వ జాతీయ రహదారి, గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ పక్కన చోటు చేసుకుంది. ఆంధ్రకు చెందిన మురళీకృష్ణ, ఝాన్సీలక్ష్మీబాయి అనే వృద్ధులు నలభై ఏళ్ల క్రితం నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి సర్వే నంబర్ 260/11, 260/14,260/15లలో ఉన్న మూడెకరాల భూమిని కొనుగోలు చేశామన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఎకరం భూమి కోల్పోగా దానికి నష్ట పరిహారం కూడా వచ్చిందన్నారు. ఉన్న రెండెకరాల్లో తాము నివాసం ఉంటున్నామన్నారు. ఆవరణలో 20 రకాల పళ్ల చెట్లను పెంచుతున్నామన్నారు. ఇన్నేళ్లుగా లేనిది ఇప్పుడు ఆ భూమి మా గ్రామానికి చెందినదని పేర్కొంటూ మర్కల్ గ్రామస్తులు తమపై దాడికి పాల్పడి ఇంటి ఆవరణలో పెంచిన చెట్లను నరికేశారని, తమపై కర్రలతో దాడి చేశారన్నారు. ఎస్సై రాజు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనా వివరాలను సేకరించారు. బాధిత వృద్ధులు ఇచ్చిన ఫిర్యాదుతో మర్కల్ గ్రామానికి చెందిన 10 మంది పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి శివారులో ఆదివారం విద్యుదాఘాతంతో మేక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన చెట్కూరి రవి తన మేకల మందను తోలుకొని గ్రామ శివారులో మేపుతున్నాడు. అందులో నుంచి ఒక మేక అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మకు తగిలింది. ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడంతో కరెంటు వైర్లు మేకకు తగలడంతో మేక అక్కడిక్కడే మృతి చెందిందన్నారు. మేక విలువ రూ. 12వేల వరకు ఉంటుందన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి బాధితుడికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ క్రిందికి ఉండడంతో తరచుగా కరంటుషాక్ తగిలి మేకలు, గొర్రెలు మృతి చెందుతున్నాయన్నారు.



బీఆర్ఎస్ నేతలకే..
సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ నేతలకే లబ్ధి చేకూరుతోందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు.
- 10లో ▸



ప్రభుత్వం దిగివచ్చేవరకు..
పార్ట్‌టైం స్వీపర్ల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిశీలించాలని వారు కోరుతున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.0 /23.0
వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'నేటినుంచి మహాత్మా గాంధీ చిత్ర ప్రదర్శన'



కామారెడ్డి క్రైం: విద్యార్థులలో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు జిల్లాలోని సినిమా హాళ్లల్లో జాతిపిత మహాత్మా గాంధీ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఆదివారం ఆయన విద్య, రెవెన్యూ, రవాణా శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సోమవారం నుంచి 24 వ తేదీ వరకు చిత్రాన్ని ప్రదర్శిస్తామన్నారు. 14 వ తేదీన ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు, 16 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. 15 న స్వాతంత్ర్య దినోత్సవం, 20న ఆదివారం కారణంగా చిత్ర ప్రదర్శన ఉండదని పేర్కొన్నారు. సినిమా హాళ్ల సీటింగ్ కెపాసిటీ మేరకు ప్రణాళికలు రూపొందించుకొని విద్యార్థులను థియేటర్‌లకు తీసుకువెళ్లి సినిమా చూపించాలని సూచించారు. సినిమా అనంతరం విద్యార్థులను క్షేమంగా ఇళ్లకు చేర్చాలని కోరారు. టెలి కాన్ఫరెన్స్‌లో డీటీవో వాణి, ఇన్‌చార్జి డీఈవో ఉమారాణి, తహసీల్దార్లు, ఎంఈవోలు, ఎంపీఐలు పాల్గొన్నారు.

'సేవ చేసి రుణం తీర్చుకుంటా'



భిక్కనూరు: రైతులకు సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానని మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లూరి హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ పురాం రాజమౌళి, డైరెక్టర్ రాకేశ్‌రెడ్డిలను బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు ద్యావర లక్ష్మి భగవాన్ సన్మానించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు సాగు విషయంలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడంతో పాటు మండల కేంద్రంలో కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేశ్, నాయకుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయాలి'

కామారెడ్డి అర్బన్: గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ కామారెడ్డికి ఇచ్చిన హామీలు అమలయ్యేవిధంగా మంత్రి కేటీఆర్ చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి ఎడ్యుకేషనల్ హబ్‌లో భాగంగా ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని, భిక్కనూర్ సౌత్ క్యాంపస్ సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థి వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని, పరిశ్రమల ఏర్పాటుపై ప్రకటన చేసి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

తీజ్ ఉత్సవాలు గిరిజనుల ఐక్యతకు ప్రతీక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తీజ్ ఉత్సవాలు గిరిజనుల ఐక్యతకు ప్రతీక అని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సోమర్యాగడి తండాలో నిర్వహించిన తీజ్ ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లకావత్ రవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

మద్నూర్(జుక్కల్): డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని వారికి, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్సై కృష్ణారెడ్డి ప్రజలకు సూచించారు. మండల కేంద్రానికి సమీపంలో పాత జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. లైసెన్స్‌లు లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణం చేయవద్దని, ఖచ్చితంగా హెల్మెట్ పెట్టుకొని వాహనాలు నడపాలని పేర్కొన్నారు. రహదారులపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

మంత్రి గారూ.. కరుణచూపరూ..



ఎల్లారెడ్డి సభా ప్రాంగణంలో ఏర్పాట్లు

- ఎల్లారెడ్డిలో బస్ డిపో కోసం దశాబ్దాలుగా నిరీక్షణ
- 'పోచారం' ఎత్తు పెంచాలని కోరుతున్న ఆయకట్టు రైతాంగం
- ఎస్టీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్న కాయితీ లంబాడీలు
- నేడు జిల్లాలో పర్యటించనున్న మంత్రి కేటీఆర్
- మంత్రి పర్యటనపై ఆశలు పెట్టుకున్న ప్రజలు

సాక్షి, కామారెడ్డి: మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి పట్టణాల్లో జరిగే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో ఆయన పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన పురపాలక, పరిశ్రమలు, ఐటీ శాఖలను నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటనపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఆర్టీసీ బస్ డిపో కోసం స్థలం కేటాయించి దశాబ్దాలు గడుస్తున్నాయి. డిపో మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. పోచారం ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు సరిగా నీరందడం లేదు. కాలువల లైనింగ్ పనులతోపాటు ప్రాజెక్టు ఎత్తు పెంచాలని రైతులు కోరుతున్నారు. ఎల్లారెడ్డి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్ పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. వాటిని పూర్తి చేయాల్సి ఉంది. పట్టణంలో రోడ్లు, మురికి కాలువలు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పోడు భూముల సమస్య ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదు. కాయితీ లంబాడీల సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

కామారెడ్డిలో ఐటీ హబ్ ఏర్పాటయ్యేనా?

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణం నాలుగైదు జిల్లాలకు కూడలిగా ఉంది. కామారెడ్డిలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన యువత ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. నిజామాబాద్‌లో ఇటీవల ఐటీ హబ్‌ను ప్రారంభించారు. కామారెడ్డిలోనూ ఐటీ హబ్ ఏర్పాటు చేస్తే ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడడంతో పాటు ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి కేటీఆర్ దీనిపై చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది. జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారని ఆశిస్తున్నారు.

కేటీఆర్ పర్యటన వివరాలు..

- మంత్రి కేటీఆర్ సోమవారం ఉదయం 9 గంటలకు ప్రగతి భవన్ నుంచి బయలుదేరుతారు.
- 11 గంటలకు 44వ నంబరు జాతీయ రహదారిపై నర్సన్నపల్లి వద్ద నిర్మించిన స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తారు. నర్సన్నపల్లి నుంచి టేక్రియాల్ వరకు నిర్మించిన ఆరు వరుసల రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌ను హౌసింగ్ బోర్డు వద్ద, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ వద్ద ప్రారంభిస్తారు.
- మధ్యాహ్నం 12 గంటలకు తాడ్వాయి మండల కేంద్రంలో రూ.2.50 కోట్లతో నిర్మించనున్న స్టేడియానికి శంకుస్థాపన చేస్తారు.
- 12.45 గంటలకు ఎల్లారెడ్డి పట్టణంలో రూ.8.54 కోట్లతో నిర్మించిన బ్రిడ్జి, రోడ్లను ప్రారంభిస్తారు. రూ.4.20 కోట్లతో నిర్మించతలపెట్టిన ఆర్టీసీ బస్టాండ్‌కు, రూ.10 కోట్లతో ఎల్లారెడ్డి పట్టణంలో నిర్మించే రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన చేస్తారు. అలాగే రూ.2 కోట్లతో వెజ్, నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.4 కోట్లతో నిర్మించే మున్సిపల్ భవనానికి శంకుస్థాపన చేస్తారు. చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తారు.
- మధ్యాహ్నం 2 గంటలకు ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ స్కూల్ పక్కనున్న మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడతారు.
- 3 గంటలకు నాగిరెడ్డిపేటలో భోజనం చేస్తారు.
- 3.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు ప్రగతి భవన్ చేరుకుంటారు.
- మంత్రి పర్యటనలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ సింధే, ఎంపీ బీబీ పాటిల్ తదితరులు పాల్గొననున్నారు.



ఘనంగా తీజ్ వేడుకలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలో బంజార తీజ్ ఉత్సవం పదో వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి మొలకల బుట్టలతో బస్టాండ్ వరకు ఆటపాటలు, గిరిజన సాంప్రదాయ నృత్యాలతో నిర్వహించారు. యువతులు తొమ్మిది రోజుల పాటు నిష్టతో మొలకలు పెంచి ఊరేగించడాన్ని తీజ్ పండుగగా నిర్వహిస్తామని మహిళలు తెలిపారు.

బీటీ రోడ్లకు రూ. 23 కోట్లు మంజూరు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలోని మట్టి, మొరం రోడ్లను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రోడ్ల అభివృద్ధికి నిధులివ్వాలని సీఎం కేసీఆర్‌ను కోరగానే సీఆర్ఆర్ నిధుల నుంచి 22 రోడ్లకు రూ.23.60 కోట్లు మంజూరు చేశారన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

మంజూరైన నిధుల వివరాలు..

- లింగాపూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మెడికల్ కాలేజీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు.
- దేవునిపల్లి నుంచి రామారెడ్డి రోడ్డు వరకు రూ. 50 లక్షలు.
- జాతీయ రహదారి నుంచి సరంపల్లి వరకు రూ. 2.40 కోట్లు.
- లింగాపూర్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వరకు రూ.50 లక్షలు.
- కేకేవై రోడ్డు నుంచి దేవునిపల్లి రోడ్డు వరకు బీటీ రోడ్డు కోసం కోటి రూపాయలు.
- రామారెడ్డి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కామారెడ్డి వరకు రూ.50 లక్షలు.
- రామేశ్వర్‌పలి జెడ్పీ రోడ్డు నుంచి డబుల్‌బెడ్ రూం కాలనీ వరకు రూ.50 లక్షలు.
- పాత జాతీయ రహదారి నుంచి రామారెడ్డి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రూ.50 లక్షలు.
- జాతీయ రహదారి నుంచి బస్వాపూర్‌కు రూ.40 లక్షలు.
- పాత జాతీయ రహదారి నుంచి భిక్కనూరు హరిజనవాడకు రూ. 1.05 లక్ష.
- దామరచెరువు జెడ్పీ రోడ్డు నుంచి బస్వాపూర్‌కు కోటి రూపాయలు.
- ర్యాగట్లపల్లి నుంచి కాట్రియాల వరకు రూ. 2.60 కోట్లు.
- తిప్పాపూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తలమడ్లకు రూ.3.50 కోట్లు.
- పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఎల్పుగొండ తండా మీదుగా దోమకొండ రోడ్డుకు రూ. 1.35 కోట్లు.
- చుక్కాపూర్ గోసంగి కాలనీ మీదుగా బండరామేశ్వరపల్లికి రూ.1.60 కోట్లు.
- ఎల్పుగొండ ఎస్సీ కాలనీ నుంచి దోమకొండ రోడ్డుకు రూ.40 లక్షలు.
- పొందుర్తి నుంచి రాజంపేట రోడ్డు కు రూ.1.50 కోట్లు.
- జనగామ నుంచి అంబారీపేట రోడ్డుకు రూ.40 లక్షలు.
- ముత్యంపేట నుంచి పల్వంచ రోడ్డుకు రూ.50 లక్షలు.
- సంగమేశ్వర్ నుంచి సీతారాంపల్లికి రూ. 2 కోట్లు.
- ముత్యంపేట నుంచి కేకేవై రోడ్డుకు రూ.50 లక్షలు.
- అంచనూర్ నుంచి కేకేవై రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు.

'సమస్యలపై సీఎంతో మాట్లాడుతా'

కామారెడ్డి అర్బన్: తమ రాతల ద్వారా తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన విలేకరులకు ప్రత్యేక రాష్ట్రం ఫలితాలు ఇంకా అందలేదని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. విలేకరుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడానికి సీఎం కేసీఆర్‌తో మాట్లాడతానన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కళాభారతిలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా రెండో మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో టీయూడబ్ల్యూజే నిర్వహించిన సమావేశంలో తాను టీడీపీ ఎమ్మెల్యేగా పాల్గొన్నానన్నారు. ఆ సమయంలో అందరూ గోడమీది పిల్లి అంటూ నినాదాలు చేశారని, అ సమావేశం అనంతరమే తాను టీడీపీకి రాజీనామా చేసి కేసీఆర్‌తో కలిసి ఉద్యమంలో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా బాన్సువాడ నియోజకవర్గంలో వీకర్ సెక్షన్ కింద విలేకరులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించామన్నారు. కామారెడ్డి పట్టణంలోనూ విలేకరులకు ఇళ్ల స్థలాల విషయమై కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. విలేకరులకు శాసన సభ్యుల దయాదాక్షిణ్యాలపై కాకుండా ప్రభుత్వపరంగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు, హెల్త్‌కార్డులు, పెన్షన్లు అందించడానికి ముఖ్యమంత్రితో మాట్లాడాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ కోరారు. దళితబంధు లాగా విలేకరులకు స్వయం ఉపాధి కోసం కనీసం రూ. 6 లక్షలకుపైగా ఆర్థిక సహాయం అందించే పథకం విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తామని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్.వేణుగోపాలచారి, జిల్లా అధ్యక్షుడు లతీఫ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఈ.ఇంద్రసేనారెడ్డి, రజనీకాంత్, సంగాయప్ప, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పి.శ్రీనివాస్, దస్తగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ పోచారంను సన్మానిస్తున్న టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు

జిల్లా కార్యవర్గం ఎన్నిక

మహాసభలలో టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రజనీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రమణ, కోశాధికారిగా ముదాం వెంకటేష్, ఉపాధ్యక్షులుగా తోట రాజేష్, సయ్యద్ అహ్మద్, ముదాం శంకర్ పటేల్, హన్మండ్లు, సహాయ కార్యదర్శులుగా భవానీసింగ్, నాగరాజు, జే.వీరయ్య, చక్రధర్, శ్రీనివాస్‌రావు, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, మీడియా ప్రచార కార్యదర్శిగా శేఖర్ ఎన్నికయ్యారు.